క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. పల్లకిసేవ వైభవంగా జరిగింది. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



వెంకటేశ్వర్లు

వెంకటాచలం : దగదర్తి మండలం తిమ్మారెడ్డిపాళేనికి చెందిన వర్థి వెంకటేశ్వర్లుకు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఈనెల 25వ తేదీన డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ మధుమతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూలో మెరైన్ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ వెంకట్రాయులు పర్యవేక్షణలో బయో అక్యుములేషన్ ఆఫ్ టాక్సిక్ మెటల్స్ అండ్ మెటల్లోతయోనిన్స్ ఇన్ సెలక్టెడ్ మెరైన్ ఫిషెస్ ఆఫ్ నెల్లూరు కోస్ట్ ఇన్ సౌత్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. దీంతో వెంకటేశ్వర్లుకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: త్రైత సిద్ధాంత ప్రచార మండలి జిల్లా అధ్యక్షుడు మౌలాతో పాటు వారి ప్రచారకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరమన సురేష్‌బాబు ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి మద్దతు తెలిపారు. నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో ఈ మేరకు త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మౌలా మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ప్రచారకర్తలకు సంబంధించి రెండు వేల కుటుంబాలు కోవూరు నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. తామంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

వైభవంగా గజ వాహన సేవ

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం తీర్థవాది, పట్టాభిషేకం, అవభృత స్నానం నిర్వహించారు. రాత్రి గజ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కొంజేటి నారాయణ, కొల్లూరు లక్ష్మీనరసింహం, కొల్లూరు మనోహర్‌కుమార్ దంపతులు వ్యవహరించారు.

సోమిరెడ్డికి ఓటు అడిగే అర్హత లేదు



మంత్రి కాకాణికి హారతులిస్తున్న మహిళ



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోని సోమిరెడ్డికి ఓటు అడిగే అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి గ్రామాల్లో మంత్రి కాకాణి శనివారం పర్యటించారు. తొలుత గొలగమూడిలో భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని ప్రతి కాలనీలో ప్రచారం చేపట్టిన మంత్రికి మహిళలు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పూలు, కర్పూర హారతులిచ్చి, విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో సర్వేపల్లి ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, అధికారంలో లేకపోయినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేశానన్నారు. తనపై ఓటమిపాలైన సోమిరెడ్డి టీడీపీ అధికారంలోకి రావడంతో దొడ్డిదారిన మంత్రి పదవి దక్కించుకుని, ఇష్టారాజ్యంగా ప్రజా సంపదను దోచుకున్నాడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు మద్దతుగా నిలవడంతో మంచి ధరలకు సంతోషంగా అమ్ముకున్నట్లు చెప్పారు. కరోనా కష్టకాలంలో తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే సోమిరెడ్డి ముఖం చాటేసినట్లు తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి ఏమి చేశాడో ప్రజలకు వివరించి, ఓటు అడగాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మట్టిరోడ్లు లేని విధంగా పూర్తి స్థాయిలో సీసీరోడ్లు, తాగునీటి పథకాలు, సైడు కాలువలు, సాగు నీటి సమస్యల పరిష్కారం.. ఇలా ఎన్నో చేయించామని వివరించారు. అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి గ్రామాల్లో సోమిరెడ్డి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో, వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఎంత మేరకు అభివృద్ధి జరిగిందో ప్రజలు తెలుసుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అనికేపల్లి సర్పంచ్ కొమరిగిరి శీనమ్మ, ఎంపీటీసీలు రేణంగి సుమతి, మేకల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రేబాల శీనయ్య, రేణంగి మనోహర్, కిరణ్, శ్రావణ్, మణి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం బాబుకు అలవాటే



దామేగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- 14 ఏళ్లు సీఎంగా బాబు చేసింది శూన్యం
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : ప్రజలకు వాగ్దానాలు చేసి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామేగుంట, వెంకన్నపురంలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామేగుంటలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కూటమిగా వస్తున్నారని, వారికి మరోసారి ఓటమి సిద్ధంగా ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించబోతుంటే 160 అసెంబ్లీ, 24 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తామని బాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల మనస్సుల్లో చిరస్థాయిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచి ఉండడాన్ని ఓర్వలేక కడుపు మంటతో బాబు, పవన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కరోనాతో రాష్ట్రం అతలాకుతలమవుతుంటే బాబు, పవన్ హైదరాబాద్‌లో విలాసవంతమైన జీవితం గడిపారే తప్ప ప్రజల్లోకి రాలేదన్నారు. పొరపాటున కూటమికి ఓటు వేస్తే సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో పాటు వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారన్నారు. పవన్ అయితే సచివాలయ వ్యవస్థను, ముస్లిం రిజర్వేషన్‌ను ఎత్తివేస్తామని బాహాటంగానే చెబుతున్నారన్నారు.

డబ్బుతో ఓటర్లను కొనలేరు

టీడీపీ ధనవంతులను బరిలో దింపి డబ్బుతో ఓటర్లను కొనుగోలు చేయాలని యత్నిస్తున్నారని, అది సాధ్యం కాదని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. నాయకులను రూ.50 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు డబ్బిచ్చి కొనుగోలు చేయడం టీడీపీ అభ్యర్థికి అలవాటు అయిపోయిందన్నారు. నా తమ్ముడు రాజేంద్రరెడ్డికి రూ.3 కోట్లు ఆఫర్ ఇస్తే తిరస్కరించి నా వెంటే ఉన్నారని తెలిపారు. టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి, నేను వేయించిన రోడ్లపై నడుస్తూ రోడ్లు లేవంటూ నన్నే విమర్శించడం సిగ్గుచేటన్నారు. కోవూరు ఓటర్లను డబ్బుతో కొనలేరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. దామేగుంట గ్రామాన్ని తాను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. దామేగుంట నుంచి రామతీర్థం రోడ్డు, అల్లూరు రోడ్డు నుంచి దామేగుంటకు రోడ్లు తానే వేయించానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గెలిచిన ఆరు నెలల్లోనే దామేగుంట, రామతీర్థం రోడ్డును తారురోడ్డుగా మార్చడంతో పాటు దామేగుంట, అల్లూరు రోడ్డును పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ, సచివాలయాల మండల కన్వీనర్‌లు జి.వెంకటశేషయ్య, కె.శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ చిమటా హరిత, నాయకులు ఎ.మోహనకృష్ణ, సీహెచ్.శేషగిరి, కె.మల్లికార్జున, బండి పెంచలయ్య, ఎం.మల్లికార్జున, ఆర్.వెంకటేశ్వర్లునాయుడు, ఎ.వెంకటరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల పర్వం



ముత్తుకూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

- 200 కుటుంబాలు పార్టీలో చేరిక

ముత్తుకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా ముత్తుకూరు మండలంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డికి గట్టి ఎదురుగాలి వీస్తోంది. మల్లూరు గ్రామంలో టీడీపీలో చేరినట్లు ప్రకటించుకున్న వారితో పాటు మరికొందరు మొత్తం 200 కుటుంబాలు శనివారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లిలో సోమిరెడ్డి వేషాలకు తెరపడిందని, తెలుగుదేశం పార్టీ దాదాపుగా ఖాళీ అవుతోందన్నారు. సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

జట్లకొండూరు నుంచి..

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు పంచాయతీ నుంచి ఉపసర్పంచ్ అవుల తులసీరామ్ ఆధ్వర్యంలో పలువురు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాడ మల్లికార్జునరావు, రాజా, నజీర్‌బాషా, జంజం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మండల పరిధిలో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వరకవిపూడి, 6.30 గంటలకు మల్లికార్జునపురం పంచాయతీల్లో ప్రచారం సాగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం నేడు

కోవూరు : మండలంలోని పడుగుపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం చేస్తారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

బాలుడి అదృశ్యం



అనిల్‌కుమార్ (ఫైల్)

విడవలూరు : విడవలూరులోని ముసలారెడ్డి గుంత వద్ద పీరిగల అనిల్‌కుమార్(8) అనే బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై రాజా శనివారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కాకినాడకు చెందిన పీరిగల సునీల్ తన భార్య, కుమారుడితో కలిసి బాతులు మేపుకుంటూ ముసలారెడ్డి గుంత సమీపంలో పొలాల వద్ద ఉంటున్నారు. ఈనెల 22వ తేదీన బాతుల వద్ద ఉన్న బాలుడు ఉన్నట్లుండి కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 90329 14581, 94407 96326 నంబర్లను సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇలాంటివి తగవని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, పోలేరమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ ఎం.శేఖర్‌బాబు, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సోమిరెడ్డి ఏదైనా అభివృద్ధి చేసి ఉంటే దాని చెప్పుకోవాలని, అయితే మిడిమిడి జ్ఞానంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాలనీల్లో ఉన్న సమస్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారమయ్యాయని, సోమిరెడ్డి మంత్రిగా పనిచేసిన సమయంలో ఏమి చేశారో చెప్పాలన్నారు. కరోనా కష్టకాలంలో మీ కుటుంబం ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. మాట్లాడే ముందు పూర్తి సమాచారం తెలుసుకుంటే మంచిదన్నారు. సమావేశంలో పార్టీ నేతలు జి.లక్ష్మీకల్యాణి, బి.భారతమ్మ, సోమా భాస్కర్, జి.వేణుగోపాల్‌రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఆకులూరు హేమంత్, భాస్కర్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

రేపు ప్రపంచ నృత్య దినోత్సవం

నెల్లూరు(బృందావనం): కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని నర్తకి సెంటర్‌లో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను శనివారం రాత్రి నర్తకిసెంటర్‌లో కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాటూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు కేతా సుబ్బారావు చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయమన్నారు.

గాంధీ కలలు సాకారం



జన సమూహంలో మాట్లాడుతున్న ప్రసన్న

కొడవలూరు : గ్రామస్థాయి పాలనతో గాంధీ కలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడుల్లో వందలాది మంది కార్యకర్తలతో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిపాళెంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లేవారని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన కొందరిని నమ్మి పెద్ద పొరపాటు చేశానని, ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రస్తుతం డబ్బుకు అమ్ముడుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్‌లు ధనమ్మ, మోర్ల రమేష్, ఎంపీటీసీ ఎం.కామేశ్వరి, వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండల కన్వీనర్‌లు గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు కాకి శ్రీనివాసులు, కె.సుమన్, ఎస్.శ్రీధర్‌రెడ్డి, కె.సుబ్బరామిరెడ్డి, బాలభాస్కర్‌రెడ్డి, డి.వి జయకుమార్‌రెడ్డి, పి.సాయిమోహన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మూడో పర్యాయం గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు హరి, భాస్కర్, అంజాద్, నాయకులు ఎం.శేఖర్‌బాబు, జి.వేణుగోపాల్‌రెడ్డి, జి.రాజగోపాల్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎల్.ఆనందరావు, చొప్పా వెంకటేశ్వర్లు, అంకోజీ, శ్రీనివాసులుగౌడ్, గౌసియా, విష్ణు, దామిశెట్టి శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో..

ముత్తుకూరు : కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక బ స్టాండ్ సెంటర్, శాంతినగర్, నవరంగ్‌హాల్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఎంపీటీసీ నవీద్‌బాషా, నాయకులు ఈదూరు శ్రీనివాసులురెడ్డి, అశోక్‌రెడ్డి, మూరాల వెంకటేశ్వర్లు, అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

- ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎంపీపీ గండవరం సుగుణమ్మ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

విడవలూరు : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డితో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, అమలైన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, సర్పంచ్ కవిత, పార్టీ నాయకులు బండ్ల గోవర్ధన్, ఉప్పాల శివకుమార్, మోర్ల మల్లికార్జున్, టి.మల్లి, ముత్యాలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

కోవూరు : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే సీఎం వైఎస్ జగన్‌కు శ్రీరామరక్ష అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి అన్నారు. కోవూరు పట్టణ పరిధిలోని శాంతినగర్, కొత్తూరు ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు మంచి చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అనూప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, పార్టీ నేత వినీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ గోపాలపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలందరికీ మంచి జరుగుతుందని, టీడీపీ అధికారంలోకి వస్తే పేదలు కష్టాలు పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో కొక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషయ్య, కిరణ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ఎన్నికల ప్రచారంలో నాయకులు



విడవలూరు : వృద్ధురాలిని పలకరిస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి



కోవూరు : మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీతారెడ్డి, పూజారెడ్డి



ముత్తుకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గోపాలపురంలో..

ఫలించని సోమిరెడ్డి రాజకీయం

- ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నలు
- కరోనా కష్టకాలంలో ఎక్కడికెళ్లారంటున్న ఓటర్లు

పొదలకూరు : సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సెంటిమెంట్ పండించేందుకు చేస్తున్న చేష్టలను ప్రజలు ఛీదరించుకుంటున్నారు. వరుస ఓటములతో కుంగిపోయిన సోమిరెడ్డికి ఈ దఫా ఎన్నికల్లో సీటు ఇచ్చేందుకు కూడా టీడీపీ అధినేత చంద్రబాబు సాహసం చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీటు ఇచ్చినా ఓటమి తప్పదని టీడీపీ శిబిరం భావిస్తోంది. కానీ మరోసారి ఓటమి తప్పదని తెలుస్తుండడంతో సోమిరెడ్డి సెంటిమెంట్ పండించేందుకు శతవిధాలా ప్రయత్నించి నవ్వుల పాలవుతున్నాడు.

ప్యాకేజీలతో..

సోమిరెడ్డికి సెంటిమెంట్ వర్కవుట్ కాకపోవడంతో వలస నేతలకు ప్యాకేజీ ఆఫర్లు ఇచ్చి సంతలో సరుకులా కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ముత్తుకూరు మండలంలో ఇద్దరు నాయకులు వైఎస్సార్‌సీపీని వీడినట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సోమిరెడ్డికి చంద్రబాబు ఎమ్మెల్సీ ఇచ్చి వ్యవసాయశాఖ మంత్రిని చేశారు. ఆయన మంత్రిగా సర్వేపల్లి నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదు. అవినీతి ఆరోపణలతో పాటు రైతురథాల పంపిణీలో అవకతవకలు, ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లకు ఆదాయం చేకూర్చారని పెద్ద ఎత్తున విమర్శలు సైతం ఎదుర్కొన్నారు. తర్వాత 2019లో కూడా కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతిలో రెండో పర్యాయం ఓటమిపాలయ్యారు. తర్వాత 2024 ఎన్నికల ముందు వరకు సర్వేపల్లి ప్రజలకు సోమిరెడ్డి అందుబాటులో లేరు. ముఖ్యంగా వరుసగా రెండేళ్ల కరోనా కష్టకాలంలో సర్వేపల్లి ప్రజలకు కనిపించకుండా దూరంగా ఉంటూ ముఖం చాటేశారు. ఎక్కడో ఉండి మంత్రి కాకాణి ప్రజలకు చేసిన సేవలను తప్పు పడుతూ ఆరోపణలు చేశారు.

సెంటిమెంటా.. అభివృద్ధా?

సాధారణంగా సెంటిమెంట్ పనిచేయాలంటే నియోజకవర్గంలో వీరోచితంగా పనులు చేసి ప్రజల బాధలు తీర్చి, నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు ఒక పర్యాయం ఓడిపోయినా తర్వాత కచ్చితంగా గెలుపొందడం చూస్తూనే ఉంటాం. అయితే సర్వేపల్లిలో ఇందుకు విరుద్ధంగా సోమిరెడ్డి వరుసగా నాలుగు పర్యాయాలు ఓటమి చెందడం చూస్తే ఆయనపై ప్రజలు నమ్మకం కోల్పోయారని తెలుస్తోంది. ప్రస్తుతం సర్వేపల్లిలో సెంటిమెంటా..అభివృద్ధా అన్న అంశంపై చర్చ జరుగుతోంది. మంత్రిగా రెండు పర్యాయాలు పనిచేసిన సోమిరెడ్డి సర్వేపల్లికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కాకాణి అభివృద్ధిలో వెనుకబడినా తర్వాత అధికార పార్టీ ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లకు సరిపడా అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రూ.375 కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించారు. రూ.130 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులను ఆధునికీకరించి ఎక్కడా గతుకుల రోడ్లు లేకుండా చేశారు. సాగునీటి రంగంలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ మేనేజ్‌మెంట్ చేసి పంటలు పండించారు. వాటికి గిట్టుబాటు ధరలే కాక 30 శాతానికి అదనంగా ధరలు లభించాయి. దీనికితోడు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సర్వేపల్లి ప్రజలు సంతృప్తికర స్థాయిలో ఉన్నారు.

చెక్కుచెదరని వైఎస్సార్‌సీపీ కేడర్

మంత్రాలకు చింతకాయలు రాని విధంగా సెంటిమెంటుకు ఓట్లు రాలవని సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం పరిశీలిస్తే అర్థమవుతోంది. ప్రచారంలో ధన ప్రవాహం ఉన్నా ఆశించిన స్థాయిలో ఆయనకు స్పందన లభించడం లేదు. ఎన్ని ఎత్తులు వేసినా వైఎస్సార్‌సీపీ కేడర్ చెక్కుచెదరడం లేదు. టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి పార్టీలో చేరినట్లుగా బిల్డప్ ఇచ్చుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటువేయని వారు అవసరాల కోసం పార్టీలోకి వచ్చి తిరిగి టీడీపీ కండువాలు కప్పుకుని ఆ పార్టీలోకి వెళ్తున్నారు. దీనినే సోమిరెడ్డి కొత్తవారు పార్టీలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. వెళ్తున్న వారు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కాదని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పలుదఫాలు ఆధారాలతో సహా నిరూపించారు. అక్కడక్కడా వైఎస్సార్‌సీపీకి చెందిన వారు స్వల్పంగా వెళ్లినా వాస్తవ పరిస్థితిని గుర్తించి తిరిగి వస్తున్నారు. పచ్చమీడియా నానాయాగి చేస్తూ టీడీపీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు. సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ పనైపోయిందనే దుష్ప్రచారం సాగించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. దీనినే ప్రజలే తిప్పికొడుతూ సోషల్ మీడియాలో చీల్చి చెండాడుతున్నారు.